

రుణమే ప్రాణమై..

అరచేతిలో ప్రపంచాన్ని చూపిస్తున్న మొబైల్ టెక్నాలజీ అదే చేత్తో ప్రజల ప్రాణాలను కూడా బలి తీసుకుంటోంది. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని లోన్ యాప్‌ల నిర్వాహకులు చెలరేగిపోతున్నారు. వారి వలలో పడి రుణాలు తీసుకుంటున్న వారు తిరిగి చెల్లించలేనప్పుడు వారి వేధింపులు తాళలేక తనువు చాలిస్తున్నారు. - 8లో



గుర్తు తెలియని వ్యక్తి హత్య

మండలంలోని వెలగవలస గ్రామానికి దూరంగా మామిడి తోటలో సోమవారం లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పరిశీలించగా అది కచ్చితంగా హత్యేనని నిర్ధారించినట్లు బొబ్బిలి డీఎస్పీ బి.మోహన్‌రావు స్పష్టం చేశారు. - 8లో



సర్కారు సాయంతో 'ఇంతి'ంతై..!

మహిళల ఆర్థిక పరిపుష్టి ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోంది. ఈ క్రమంలో వారు అన్నిరంగాల్లో రాణించేందుకు చర్యలు తీసుకుంటోంది. - 8లో

న్యూస్‌రీల్

ప్రత్యేక బస్సుల ద్వారా రూ. 27.38 లక్షల ఆదాయం

- జిల్లా ప్రజా రవాణా అధికారి సుధాకర్



టీవీఎస్ సుధాకర్

పార్వతీపురం టౌన్: జిల్లాలో సంక్రాంతి ప్రత్యేక బస్సుల ద్వారా రూ. 27.38 లక్షల ఆదాయం చేకూరిందని జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు. స్థానిక డీపీటీఓ కార్యాలయంలో విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో మూడు డిపోల నుంచి 107 అదనపు సర్వీసులు నడిపామన్నారు. పార్వతీపురం డిపో నుంచి 45 అదనపు సర్వీసులు నడపగా రూ.12.75 లక్షల ఆదాయం, పాలకొండ డిపో నుంచి 42 అదనపు సర్వీసులు నడపగా రూ.9.86 లక్షలు, సాలూరు డిపో నుంచి 20 అదనపు సర్వీసులు నడపగా రూ.6.92 లక్షల ఆదాయం చేకూరిందన్నారు. జిల్లాలో మొత్తం 16,212 మంది ప్రయాణికులు ప్రయాణించారన్నారు. ఆర్టీసీ ఆదాయానికి కారణమైన సిబ్బందికి, ప్రయాణికులకు ధన్యవాదాలు తెలిపారు.

బొల్లినేని మెడిస్కిల్స్‌లో ఉచిత శిక్షణ, ఉద్యోగాల కల్పన

శ్రీకాకుళం రూరల్: మండలంలోని రాగోలులో గల జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్‌లో బయాలజీ సైన్స్, సోషియాలజీ, సోషల్ సైన్సు, పబ్లిక్ హెల్త్‌లో డిగ్రీ లేదా పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ఎచ్చెర్లలోని ఏపీఎస్ఎడీసీ, సీడాప్ ఆధ్వర్యంలో ఎచ్చెర్లలో గల డీటీడీసీలో 4 నెలలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శిక్షణకు హాజరైన వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ శిక్షణ పూర్తయిన వారికి కార్పొరేట్, ఇతర ఆస్పత్రుల్లో ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు. 20–30 మధ్య వయసులో ఉన్న వారు అర్హులని, వివరాల కోసం 76809 45357, 79950 13422 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

23న సర్కిల్ స్థాయి డాక్ అదాలత్

విజయనగరం టౌన్: తపాలా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న విజయవాడ వేదిగా సర్కిల్ స్థాయి డాక్ అదాలత్ నిర్వహించనున్నట్టు విజయనగరం తపాలా శాఖ సూపరింటెండెంట్ ఈశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని తపాలా కార్యాలయాల్లో అందించే సేవలకు సంబంధించిన అంశాలపై జనవరి 23న ఉదయం 11.30 గంటలకు విజయవాడ పోస్టల్ సర్కిల్ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత పిర్యాదులను ఈ నెల 18లోపు మెయిల్, పోస్టల్ ద్వారా కె.సుధీర్ బాబు, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జనరల్, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సర్కిల్, విజయవాడ 520013 చిరునామాకు పంపించాలని సూచించారు. పోస్టు కవర్‌పై డాక్ అదాలత్ అని స్పష్టంగా రాయాలని పేర్కొన్నారు.

జోరుగా భూసర్వే : ఆర్డీఓ



రీసర్వేపై రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ శేషశైలజ

మెంటాడ: డివిజన్ పరిధిలో భూములు రీసర్వే జోరుగా సాగుతుందని బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ అన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎంతో సాంకేతిక పరిజ్ఞానంతో రైతుల భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ రీసర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. భవిష్యత్‌లో ఇక భూ వివాదాలు ఉండవన్నారు. డివిజన్ పరిధిలో మొదటి విడతగా 273 గ్రామాల్లో సర్వేను ప్రారంభించగా ఇప్పటి వరకు 100 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. మండలంలో 962 ఎకరాల్లో రీసర్వే చేపట్టగా ఇప్పటి వరకు 124 మ్యుటేషన్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం పెదమేడపల్లి గ్రామంలో సర్వే జోరుగా సాగుతుందన్నారు.

సిబ్బంది గైర్హాజరుపై ఆర్డీఓ ఆగ్రహం

తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గైర్హాజరుపై ఆర్డీఓ శేషశైలజ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఉదయం 10.30 గంటలకు ఆమె సందర్శించగా తహసీల్దార్, డీటీ, ఆర్ఐ, సీనియర్ సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు ఆ సమయానికి విధులకు హాజరు కాకపోవడంపై మండిపడ్డారు. తాను వస్తానని ముందుగా సమాచారం ఇచ్చినా అధికారులు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహించారు. వారికి ఫోన్ చేసి ప్రశ్నించారు.



బోధనా పద్ధతులను వివరిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ (ఫైల్)

స్కూల్ కాంప్లెక్స్‌లు..
బోధనా నైపుణ్య వేదికలు

సమాజాభివృద్ధి విద్యతోనే ముడిపడి ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రతి ఒక్కరూ విద్యావంతులైతే ఆ సమాజం మరింతగా అభివృద్ధి చెందుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే జగన్ మోహన్‌రెడ్డి సర్కారు విద్యకు తొలి ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతి ఒక్కరూ విద్యా వంతులు కావాలనే ఉద్దేశంతోనే పలు పథకాలు ప్రవేశపెట్టింది. విద్యార్థులు బడి బాట పడుతున్న వేళ.. వారికి మెరుగైన బోధన అందించేందుకు టీచర్లను వృత్తిపరంగా మరింత తీర్చిదిద్దే చర్యలు చేపట్టింది. బోధనా నైపుణ్యాలను మెరుగుపరచి తద్వారా విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేలా స్కూల్ కాంప్లెక్స్‌ల ద్వారా చర్యలు చేపట్టింది.

- జిల్లాలో 120 స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణ
- వీటి పరిధిలో 1491 స్కూళ్లు, 120 మంది సీఆర్పీలు
- విద్యా పథకాల అమలు, ప్రమాణాల పర్యవేక్షణ

పార్వతీపురం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. పిల్లల చదువే రాష్ట్ర పెట్టుబడిగా భావిస్తోంది. విద్యకు అధిక నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా ప్రమాణాలతో కూడిన విద్యను బోధించేందుకు అనువుగా... ఉపాధ్యాయులకు మరింత మెరుగైన శిక్షణ అందించేదుకు స్కూల్ కాంప్లెక్స్‌లు దోహద పడుతున్నాయి. చక్కని బోధనా ప్రణాళికలు అమలు దిశగా ముందుకు సాగుతోంది.

బోధన నైపుణ్య వేదిక

ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి. చదువుకుంటేనే చక్కగా బోధించగలడు. బోధనా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరచుకుంటేనే తరగతి గదిలో సమర్థవంతమైన బోధన అందించగలడు. దీని కోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు, బోధన అనుభవాలను పంచుకునేందుకు స్కూల్ కాంప్లెక్స్ పేరుతో చక్కని వేదికను విద్యా శాఖ నిర్వహిస్తోంది. విద్యా అభ్యసనా సామర్థ్యాలను మూల్యాంకనం చేసి మెరుగైన బోధనా పద్ధతులపై ఎప్పటికప్పుడు చర్చించి గుణాత్మక విద్యను అందించడంలో స్కూల్ కాంప్లెక్స్ వ్యవస్థ ఎంతో కీలకంగా పని చేస్తోంది. జాతీయ నూతన విద్యా విధానం అమలులో భాగంగా ఈ వ్యవస్థను పునర్నిర్మించేందుకు విద్యాశాఖ నడుం బిగించింది. ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ.. అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు విద్య, ఉపాధి రంగాల్లో రాణించేలా పాఠశాల దశలోనే గట్టి పునాది వేసే చదువు ప్రణాళికలు అమలు దిశగా స్కూల్ కాంప్లెక్స్‌లను తీర్చిదిద్దుతోంది. సౌకర్యాలు కల్పిస్తూ.. కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది.

మరింత సమర్థవంతంగా..

స్కూల్ కాంప్లెక్స్‌లను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీలను నియమించింది. జాతీయ నూతన విద్యా విధానం – 2020 నిబంధనలను అనుసరించి స్కూల్ కాంప్లెక్సులు రూపాంతరం చెందాయి. అన్ని యాజమాన్యాల స్కూళ్ల ఉపాధ్యాయులకు లెర్నింగ్ సెంటర్లుగా వీటిని మార్చారు. ఇంతవరకు 15 నుంచి 20 మంది ఉపాధ్యాయులకు చోటున్న కాంప్లెక్స్‌ను 40 – 50 మంది ఉపాధ్యాయులకు విస్తరించారు. గ్రామీణ ప్రాంతాలలో 10 నుంచి 15 కిలోమీటర్ల దూరంలో వున్న 10 – 20 స్కూళ్లకు ఒక కాంప్లెక్స్, పట్టణ ప్రాంతాలలో 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న 10 – 15 స్కూళ్లకు ఒక కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

కొత్త కమిటీలు

మండల స్థాయి కమిటీలో ఉన్నత పాఠశాల గ్రేడ్ – 2 ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాశాఖ అధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా మండలంలోని ఉన్నత పాఠశాల హెచ్ఎం, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఒకరు, సీఆర్పీ ఉంటారు. జిల్లా స్థాయి కమిటీ చైర్మన్‌గా జిల్లా విద్యాశాఖ అధికారి, కన్వీనర్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, కో – కన్వీనర్లుగా డైట్ ప్రిన్సిపాల్, డిప్యూటీ ఈఓలు, డివిజన్ నుంచి ఒక ఎంఈఓ వ్యవహరిస్తారు.

జిల్లాలో 120 స్కూల్ కాంప్లెక్సులు

జిల్లాలోని 15 మండలాల్లో ఏర్పాటు చేసిన 120 స్కూల్ కాంప్లెక్స్‌లలో సీఆర్పీలను నియమించారు. జిల్లాలో 1491 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. మండలంలోని 10 – 20 స్కూళ్ల కోసం ఒక్కో కాంప్లెక్స్ చొప్పున ఏర్పాటు చేశారు. అత్యధికంగా జిల్లా పరిధిలో సీతంపేట మండలంలో 15 స్కూల్ కాంప్లెక్స్‌లున్నాయి.

జిల్లాలో స్కూల్ కాంప్లెక్స్‌లు

మండలం	స్కూల్ కాంప్లెక్స్‌లు
గరుగుబిల్లి	05
కురుపాం	10
జియ్యమ్మవలస	07
గుమ్మలక్ష్మీపురం	09
కొమరాడ	07
పార్వతీపురం	11
సీతానగరం	06
బలిజిపేట	06
సాలూరు	12
మక్కువ	06
పాచిపెంట	09
పాలకొండ	07
సీతంపేట	15
వీరఘట్టం	06
భామిని	04
మొత్తం	120

స్కూల్ కాంప్లెక్స్ ఆవశ్యకత

- స్కూల్ కాంప్లెక్స్‌లో 1 నుంచి 5వ తరగతి ఉపాధ్యాయులకు, 6, 7, 8వ తరగతులకు పాఠాలు చెప్పే సబ్జెక్టు టీచర్ల బోధనపై సమీక్ష ఉంటుంది.
- ఉపాధ్యాయులలో వృత్తిపర నైపుణ్యాన్ని అభివృద్ధి పరచడం, విద్యావిషయం సహకారం ఉపాధ్యాయులకు నిరంతరంగా అందించాలి.
- విద్యాభివృద్ధి లక్ష్యంగా బోధనా అనుభవాలను తోటి ఉపాధ్యాయులతో పంచుకోవాలి.
- తరగతి గది నిర్వహణలో వినూత్న పద్ధతులను పంచుకుంటూ, ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించాలి.
- ప్రాథమిక స్థాయిలో గుణాత్మక విద్యను పెంపొందించడపై సమీక్షించాలి.
- విద్యార్థుల హాజరు శాతం పెంచడం, వారి సామర్థ్యం మెరుగుపరచడం నిరంతర ప్రక్రియగా జరిగేలా పర్యవేక్షించాలి.
- పాఠశాలల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం పెంపొందించడంలో శ్రద్ధ తీసుకుంటూ ఎడ్యుకేషన్ హబ్‌గా పని చేయాలి.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా నూతన మార్గదర్శకాలతో రూపొందుతున్న స్కూల్ కాంప్లెక్స్‌ను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలి. తోటి ఉపాధ్యాయులలోని నైపుణ్యాలను పంచుకోవాలి. విద్యాశాఖ అమలులోకి తెస్తున్న నూతన బోధనా శైలిని అర్థం చేసుకోవాలి. స్కూల్ నిర్వాహణకు ప్రాధాన్యమివ్వాలి. పిల్లలకు పాఠశాల విద్యతో పాటు నైతిక విలువలను బోధించాలి. భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి.

– పి.బ్రహ్మాజీరావు, డిప్యూటీ ఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

ఏనుగుల దాడిలో రైతు మృతి



చిన్నారావు మృతదేహం



జియ్యమ్మవలస: సింగనాపురంలో అరటి తోట నుంచి బయటకు వస్తున్న ఏనుగులు

భామిని: మండలంలోని తాలాడకు చెందిన రైతు గోపిశెట్టి చిన్నారావు(53) సోమవారం ఏనుగుల దాడిలో గాయపడి రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే...తాలాడ సమీపంలో తిష్ట వేసిన ఏనుగులు కొద్ది రోజులుగా పంటలను ధ్వంసం చేస్తున్నాయి. సోమవారం తాలాడలో రోడ్డుపైకి వచ్చి గందరగోళం సృష్టించాయి. ఇదే సమయంలో రైతు గోపిశెట్టి చిన్నారావుపై దాడి చేశాయి. దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారావును కుటుంబ సభ్యులు రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య రవణమ్మతో పాటు ఇద్దరు కుమారులున్నారు. ఈ ఘటనతో తాలాడలో విషాదం నెలకొంది. వీఆర్‌ఓ సీహెచ్ భారతి ఆధ్వర్యంలో వివరాలు సేకరించిన ఎస్ఐ కె.అమ్మాన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం..

ఏనుగుల దాడిలో చిన్నారావు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మృతుని కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏనుగుల దాడిలో నష్టపోయిన పంటలకు తగిన పరిహారం కోసం ప్రభుత్వం వద్ద ప్రతిపాదన ఉందని తెలిపారు. రైతుల ఆందోళన గుర్తించి జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

వీడని ఏనుగుల బెడద

జియ్యమ్మవలస: మండలంలోని నాగావళి నదిలో ఏనుగులు సోమవారం మళ్లీ దర్శనమిచ్చాయి. మంగళవారం ఉదయం పెదకుదమ, సింగనాపురం పంట పొలాల్లోకి ప్రవేశించాయి. వీటి రాకతో సింగనాపురం రైతులు భయాందోళనలు చెందుతున్నారు. అరటి పంట కోత దశలో ఉందని, పంట పొలాల్లోకి చొరబడితే మొత్తం నాశనమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ సిబ్బంది ఏనుగులను ఈ ప్రాంతం తరలించే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రోడ్డెక్కిన బాధిత రైతులు

- ఏనుగుల తరలింపు చర్యలకు డిమాండ్
- పంట నష్ట పరిహారం ఇవ్వాలి..
- మృతుల కుటుంబాలకు పరిహారం వెంటనే చెల్లించాలి



రోడ్డుపై బైఠాయించిన రైతులు

భామిని: ఏనుగుల సంచారంతో జరుగుతున్న ఆస్తి, ప్రాణ నష్టాలకు ఇప్పటికైనా చెక్ పెట్టేలా... ఏనుగులను ఇక్కడి నుంచి తరలించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు మంగళవారం రోడ్డెక్కారు. తాలాడ, ఘనసర, కోసలి, కీసరకు చెందిన బాధిత రైతులు ఆందోళన చేపట్టారు. తాలాడకు చెందిన రైతు గోపిశెట్టి చిన్నారావు ఏనుగుల దాడిలో గాయపడి మంగళవారం మృతి చెందడంతో ఆందోళన చెందిన రైతులు ఏబీ రోడ్డుపై మంగళవారం రాస్తారోకో చేపట్టారు. గంటల కొలది వాహనాలను నిలిపివేశారు. ఏనుగుల దాడిలో జరుగుతున్న పంట నష్టాలను అటవీ శాఖాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఏనుగులను ఇక్కడ నుంచి తరలించే చర్యలు కూడా చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనకారులకు కోసలి సర్పంచ్ మజ్జి మోహనబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎరుకుమజ్జి పాపినాయుడు, కిల్లారి ఫాల్గుణరావు, వలరౌతు రామకృష్ణ మద్దతుగా నిలిచారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న పాలకొండ సీఐ మురళీధర్, ఫారెస్ట్ రేంజర్ కె.తవిటినాయుడు, తహసీల్దార్ సీలాపు అప్పారావు రాస్తారోకో వద్దకు వచ్చి ఆందోళనకారులను శాంతింపజేశారు. రైతుల ఆందోళనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. బత్తిలి ఎస్ఐ అమ్మాన్‌రావు, ఆర్ఐ ఎస్.రాంబాబు, వీఆర్‌ఓ సీహెచ్ భారతి ఉన్నారు.

గృహ సందర్శనలతో సత్ఫలితాలు

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు




బాలింతలతో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ జగన్మోహనరావు

సీతానగరం: జిల్లాలో హైరిస్క్ గర్భిణులు, నవజాత శిశువులను వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు గృహ సందర్శనలు చేసి ఆరోగ్యం పర్యవేక్షించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని చినంకలాం గ్రామంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య పర్యవేక్షణ, టీకా నిర్వహణకు సంబంధించిన మాతా శిశు సంరక్షణ కార్డులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని అన్నారు. వైద్య సిబ్బంది అందిస్తున్న ఐరన్ మాత్రలు క్రమ పద్ధతిలో వేసుకోవాలని సూచించారు. వీటి వల్ల ప్రసవ సమయంలో రక్తహీనతకు గురి కాకుండా ఉండవచ్చన్నారు. చిన్నారుల ఆరోగ్య పర్యవేక్షణ విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది సూచించిన తేదీల ప్రకారం పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మాతా శిశు ఆరోగ్య రక్షణపై ప్రత్యేక దృష్టి

- డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పాలకొండ రూరల్: మాతా శిశు రక్షణపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్‌ఓ బగాది జగన్నాథరావు అన్నారు. పాలకొండ వంద పడకల ఏరియా ఆస్పత్రితో పాటు అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడి ఏఎస్ఎంలు, ఆశా సిబ్బందితో సమీక్షించారు. స్థానికంగా మాతా శిశు కేసుల నమోదుపై ఆరా తీశారు. ముఖ్యంగా హైరిస్కు కేసుల విషయంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే 10 నుంచి 15 సంవత్సరాల మధ్య గల పిల్లల్లో చోటు చేసుకునే రక్త హీనతను గుర్తించేందుకు చేయించాల్సిన వైద్య పరీక్షలు, అందించాల్సిన చికిత్స, కౌన్సెలింగ్‌పై వివరించారు. ఈ క్రమంలో ఏహెచ్‌లో గల టీబీ వైద్య పరీక్ష నిర్ధారణ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట జెమ్స్ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పీవీవీకే.సుబ్బారావు, డీటీసీఓ డాక్టర్ శ్యామ్, వైద్యాధికారులు కమల్‌కుమార్, సౌమ్య, జిల్లా మాస్ మీడియా అధికారి యోగేశ్వరరెడ్డి, జగదీష్, రాజశేఖర్ తదితరులున్నారు.

25 రోజుల్లో వివాహం...
ఇంతలోనే విషాదం

- అత్తారింటికి వెళ్తూ...
- కాబోయే అల్లుడు దుర్మరణం
- రెండు బైక్‌లు ఢీకొని యువకుడి మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- గంగారేగువలసలో విషాదం

ఆ యువకుడికి ఫిబ్రవరి 11న వివాహం.. విశాఖలో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ సంక్రాంతి పండుగ కోసం కన్నవారింటికి వచ్చాడు. ముక్కనుమ రోజు కాబోయే భార్యను చూసొద్దామని బైక్‌పై అత్త వారింటికి వెళ్దామని బయలుదేరాడు. ఇంతలోనే మరో బైక్ వచ్చి ఢీకొంది. అంతే కాబోయే పెండ్లి కుమారుడు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. దీంతో ఇటు కన్నవారింట.. అటు కాబోయే అత్తవారింట విషాదం అలుముకొంది. వివరాల్లోకి వెళ్తే...

కొమరాడ: మండలంలోని గంగారేగువలస గ్రామంలోని రామమందిరం వీధికి చెందిన రావాడ రాజశేఖర్ విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. సంక్రాంతి పండుగ కోసం కొద్ది రోజుల కిందట స్వగ్రామానికి వచ్చాడు. సంక్రాంతిని కుటుంబ సభ్యులతో... స్నేహితులతో సరదగా గడిపాడు. ముక్కనుమ రోజు మంగళవారం ఉదయం అదే గ్రామంలో పక్క వీధిలో అత్తారింటికి వెళ్లి కాబోయే భార్యను చూసొద్దామని తన బైక్‌పై బయలుదేరాడు. ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరిన రాజశేఖర్ రోడ్డుపైకి వెళ్తుండగానే కొమరాడ నుంచి బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు అదుపుతప్పి బలంగా ఆ బైక్‌ను ఢీకొన్నారు. దీంతో రాజశేఖర్ (26) పడిపోయాడు. తీవ్రంగా గాయపడి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. వేరే బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. రాజశేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కొమరాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మరో 25 రోజుల్లో ఫిబ్రవరి 11న పెళ్లి పీటలు ఎక్కాల్సిన రాజశేఖర్ ఇలా మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదం నెలకొంది. రాజశేఖర్ మృతితో ఇటు కన్నవారింట.. అటు కాబోయే అత్తవారింట సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాజశేఖర్ తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు అక్క ఉంది.



రావాడ రాజశేఖర్(ఫైల్)



మృతదేహం వద్ద కన్నీరుమున్నీరు అవుతున్న కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

కొట్లాటలో ఒకరికి గాయాలు


చికిత్స పొందుతున్న గణనాథం

పార్వతీపురం: ఇద్దరి మధ్య వాదులాట ఘర్షణకు దారితీసింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాత్రి పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో ఇద్దరు మూగవాళ్ల మధ్య ఘర్షణ జరిగింది. అది కాస్తా వారి తల్లిదండ్రుల మధ్య తీవ్ర వాదోపవాదాలకు దారితీయడంతో కొట్లాట జరిగింది. ఈ ఘర్షణలో దొగ్గ గణనాథాన్ని అదే గ్రామానికి చెందిన వర్రి శ్రీను రైలు పెంకుతో తలపై కొట్టాడు. దీంతో గణనాథం తలకు గాయం కావవడంతో స్థానికులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఈ మేరకు ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: జాతీయ చేనేత అభివృద్ధి పథకం(ఎన్‌హెచ్‌డీపీ)లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో ఏర్పాటైన రెండు క్లస్టర్ డెవలప్‌మెంట్ పథకా(సీడీపీ)లకు 14 పోస్టులు మంజూరైనట్లు చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి ఐ. ధర్మారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ, నారాయణపురంలలో ఈక్లస్టర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు మంజూరైన సీడీపీల్లో టెక్స్‌టైల్స్ డిజైనర్ 7 ఖాళీలు, క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్ 7 ఖాళీలు ఉన్నాయని ఆసక్తిగల అభ్యర్థులు సంచాలకుడు, చేనేత, జౌళి శాఖ, అమరావతి చిరునామాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పాలకొండ రూరల్: పాలకొండ-వీరఘట్టం రహదారిలో రాయుని కోనేటి వద్ద గల శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ సమీపంలో పేకాట నిర్వహిస్తున్న, ఆడుతున్న ఏడుగురిని పాలకొండ ఎస్సై బి.శివప్రసాద్ అరెస్టు చేశారు. స్థానిక పోలీసులు ఎస్సై నేతృత్వంలో మంగళవారం పెట్రోలింగ్ చేపట్టిన సమయంలో పేకాట ఆడుతున్న వారిని గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.9,400 స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పేకాట శిబిరాలు నిర్వహించినా, నిషేధిత క్రీడలను ప్రోత్సహించినా చట్టపరమైన కేసులు తప్పవని హెచ్చరించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన చిన్నయ్య

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీలో నివాసముంటున్న కొండగొర్రి చిన్నయ్య అలియస్ సూర్యనారాయణ(44) మనస్తాపంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ఎల్విన్‌పేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిన్నయ్య భార్య ఏడాది క్రితం కనుమ రోజున మృతిచెందింది. భార్య ఉండి ఉంటే ఇబ్బందులుండేవి కాదని గుర్తుచేసుకుంటూ తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయం చూసి చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. మృతుడికి పన్నెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

పురుగు మందు తాగి వృద్ధుడు..

వంగర: మండల పరిధి ఇరువాడ పంచాయతీ చంద్రంపేట గ్రామానికి చెందిన వృద్ధుడు మడక జగన్నాథం(70) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధుడు ఈ నెల 13న పురుగు మందు తాగడంతో కుటుంబసభ్యులు గమనించి విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని, మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోకేశ్వర రావు వెల్లడించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230

రుణమే ప్రాణమై..

- చెలరేగుతున్న లోన్ యాప్ నిర్వాహకులు
- వారి వలలో పడి మోసపోతున్న యువత
- ఎటువంటి హామీ లేకుండా అప్పులిస్తామని ఎర
- తక్షణమే రుణమిచ్చి 40నుంచి 50శాతం వడ్డీ వసూలు



లోన్‌యాప్‌ల నెట్‌ఫొటోలు

పార్వతీపురం టౌన్: అరచేతిలో ప్రపంచాన్ని చూపిస్తున్న మొబైల్ టెక్నాలజీ అదే చేత్తో ప్రజల ప్రాణాలను కూడా బలి తీసుకుంటోంది. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని లోన్ యాప్‌ల నిర్వాహకులు చెలరేగిపోతున్నారు. వారి వలలో పడి రుణాలు తీసుకుంటున్న అమాయకులు. తిరిగి చెల్లించలేనప్పుడు వారి వేధింపులు తాళలేక తనువు చాలిస్తున్నారు. ఇటువంటి సంఘటనల్లో కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. నిర్వాహకుల వేధింపులు, పరువు, ప్రతిష్టలు రోడ్డున పడతాయనే భయంతో ఆందోళనలో ఏం చేయాలో తెలియక ప్రాణాలు పైకి తెచ్చుకుంటున్నారు.

హామీ లేకుండా రుణాలతో వల

మీ మొబైల్ ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి..'హామీ లేకుండానే రుణం పొందండి' అని లోన్ యాప్స్ నిర్వాహకులు ఇచ్చే ప్రకటనలు ఇవి. హామీ అవసరమే లేదనడంతో పేద, మధ్యతరగతి వర్గాల వారు ఆకర్షితులై వారి మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. వివరాలు ఇవ్వడమే ఆలస్యం. క్షణాల్లో రూ.50 వేల లోపు రుణం వారి ఖాతాలో జమైపోతోంది. ఇలా ఆన్‌లైన్ ఆధారిత లోన్ యాప్ ఉచ్చులోకి లాగుతున్నారు. రుణం ఇచ్చేటప్పుడు హుందాగా వ్యవహరించే నిర్వాహకులు చెల్లించడం ఒక్క రోజు ఆలస్యమైనా బెదిరింపులు, వేధింపులకు దిగుతున్నారు. డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడే మొబైల్‌లోని కాంటాక్ట్ నంబర్లు, ఫొటోలు, వీడియోలు సహా అన్నింటికీ యాప్ నిర్వాహకులకు యాక్సెస్ ఇవ్వాలి. లేదంటే రుణం రాదంటారు. యాక్సెస్ ఇవ్వగానే రుణం తీసుకున్న వారి ఫోన్ వివరాలు లోన్ యాప్ సర్వర్లకు అనుసంధానమవుతాయి. అవసరార్థం అప్పు ఇస్తే చాలనుకునే సందర్భంలో షరతులు, నిబంధనలను చూసుకోకుండానే చాలామంది అంగీకరిస్తున్నారు. అదే వారి పాలిట యమపాశమవుతోంది.

భరించలేని వేధింపులు

రుణం తీసుకున్న రోజు నుంచే చెల్లింపుల కోసంనిర్వాహకులు ఒత్తిడి తెస్తున్నారు. చెల్లింపు ఆలస్యమయ్యే కొద్దీ వేధింపులు పెరిగిపోతాయి. రుణగ్రహీత మొబైల్ నంబర్లకు పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించే పోస్టులు, దుష్పచారాలతో కూడిన సందేశాలు, ఫొటోలు పంపిస్తారు. బెదిరింపులు లెక్క చేయకపోతే రుణగ్రహీత కుటుంబసభ్యుల ఫొటోలను మార్ఫింగ్ 'నగ్నంగా మార్చి మొబైల్‌లోని కాంటాక్ట్ నంబర్లన్నింటికీ వాట్సాప్‌లో పంపుతారు. బతికుండగానే అతడి ఫొటోకు దండేసి చనిపోయినట్లు ప్రచారం చేయడం. ఇలా లోన్‌యాప్ నిర్వాహకుల ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. వారి ఆగడాలను కొందరు బయటకు చెప్పుకోలేక కుమిలిపోతూ బలవన్మరణాలకు పాల్పడుతుంటే.. ఇంకొందరు ఒక యాప్‌లోని అప్పు తీర్చేందుకు మరో యాప్‌లో రుణం తీసుకుంటూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

ఈజీ రుణంతో వల

లోన్ యాప్‌లో రుణం కోసం ఎటువంటి హామీ అవసరం లేదు.

- మొబైల్ ఉండి, లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది.
- హామీ లేకుండా రూ.2,000 నుంచి రూ.50 వేల వరకూ లోన్ యాప్‌లో ఇస్తుంటారు.
- రుణం చెల్లింపులో ఒక్క రోజు ఆలస్యమైనా లోన్ యాప్ నిర్వాహకులు ఉపేక్షించరు.
- లోన్ యాప్‌డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా మొబైల్‌లోని వ్యక్తిగత డేటా (సమగ్ర సమాచారం) నిర్వాహకుల గుప్పిట్లోకి వెళ్లిపోతుంది.

కొత్త కొత్త పేర్లతో..

యాప్‌లను మొబైల్‌లోని ప్లేస్టోర్ నుంచి తొలగించడంతో నిర్వాహకులు ఇప్పుడు కొత్త కొత్త పేర్లతో తెరపైకి వచ్చారు. క్యాష్ బెస్. లెండ్ మాల్ క్యాష్ అడ్వాన్స్ రుపీ కింగ్, రుపీ బాక్స్, ఓకే సస్ ఫైన్, టౌన్ మనీ గ్రాంట్, భారత్ లోన్, ముషీ గ్రాంట్ గోల్డ్ బీ టెండ్ మాల్, భారత్ క్యాష్, ఏ ఫూర్, లెండ్ రోజే టెండ్, స్మాల్ క్యాష్, ఎక్స్ పీ క్యాష్, మనలీ మాస్టర్, లెండ్ కింగ్, లింగ్ పోస్ట్, కోకో ఫాస్ట్, కోకో లెండ్ వంటి పేర్లతో ఇప్పుడు కార్యకలాపాలతో నిర్వాహకులు అమాయక ప్రజలను మోసాలు చేస్తున్నారు.

'అపరిచిత యాప్‌లపై అప్రమత్తం అవసరం



చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్‌లో మనకు తెలియని అపరిచిత యాప్ కనిపిస్తే అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రతి యాప్‌ను ఆయాచితంగా క్లిక్‌చేసే అలవాటుతో ఇబ్బందులు కొని తెచ్చుకుంటారు. అడ్డగోలు లోన్ యాప్‌లోకి వెళ్తే మీ వ్యక్తిగత సమాచారం వారి గుప్పిట్లోకి వెళ్తోంది. మోసపూరితంగా ఉంటున్న లోన్‌యాప్‌ల జోలికి దయచేసి వెళ్లొద్దు. నిర్వాహకులు వేధిస్తున్న తక్షణమే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడమే కాకుండా సంబంధిత బ్యాంకు అధికారులను కూడా సంప్రదించాలి.

–ఒ.దిలీప్‌కిరణ్, జిల్లా అదనపు ఎస్పీ, పార్వతీపురం మన్యం

లోన్ యాప్‌ల జోలికి పోవద్దు



లోన్ యాప్‌ల జోలికి పోయి లేనిపోని ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దు. ప్లేస్టోర్‌లో అనుమతులు లేని యాప్‌ల నిర్వాహకులపై ప్రత్యేక దృష్టి సారించాం. లోన్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల మొబైల్‌లో ఉన్న వ్యక్తిగత సమాచారం నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తోంది. వాటిని ఆసరాగా తీసుకుని బెదిరింపులకు పాల్పడే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు లోన్‌యాప్‌ల జోలికి వెళ్లి ఎటువంటి ఇబ్బందులు పడవద్దు. ఎవరైనా లోన్ యాప్‌ల నిర్వాహకులు వేధించినట్లైతే తక్షణమే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. అలాగే సంబంధిత బ్యాంకు అధికారులకు కూడా విషయాన్ని తెలియపరిచి అకౌంట్‌ను లాక్‌చేసుకోండి.

–విద్యాసాగర్ నాయుడు, ఎస్పీ, పార్వతీపురం మన్యం

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాటుచేయాలి

పార్వతీపురం: గణతంత్ర దినోత్సవం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన గణతంత్రదినోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణతంత్ర దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మైదానంలో ఏర్పాట్లను రహదారులు, భవనాల శాఖచేయాలని, వేదిక పర్యవేక్షణ ఆర్‌డీఓ చూడాలని కోరారు. పూర్తిస్థాయిలో పోలీస్ పరేడ్, బందోబస్తు ఉండాలని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేయాలని డీఈఓకు, పారిశుధ్యం, తాగునీరు సౌకర్యం కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులకు, వైద్య శిబిరం ఏర్పాటుచేయడంతోపాటు అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని డీఎంహెచ్‌ఓకు తెలియజేశారు. పౌరసరఫరాలు, గృహనిర్మాణసంస్థలు, జిల్లా విద్యా, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధశాఖలు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా వైద్య రోగ్యశాఖ, జలవనరులశాఖ, జిల్లా నీటి యాజమాన్యసంస్థ తదితర శాఖలు శకటాలను ఏర్పాటుచేయాలని, అలాగే రవాణాశాఖ, ఐసీడీఎస్, అటవీశాఖ ప్రదర్శనశాలలను ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. ప్రదర్శనశాల ఏర్పాటుకు డీఆర్‌డీఏ పీడీ, శకటాల ఏర్పాటుకు డ్వామా పీడీ సమన్వయకర్తలుగా ఉంటారని స్పష్టం చేశారు.

19లోగా ఉత్తమ ఉద్యోగుల జాబితా ఇవ్వాలి

ఈనెల 19లోగా ఉత్తమ ఉద్యోగుల జాబితాను కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని అధికారులను జేసీ ఆదేశించారు. గణతంత్ర దినోత్సవంలో భాగంగా ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేస్తారని తెలిపారు. ఇందుకు ప్రతిశాఖనుంచి ఇద్దరు ఉద్యోగుల వివరాలను సమర్పించాలని సూచించారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ



నాయకులు, ప్రజలతో మంత్రి బొత్స, జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన మాటామంతీ

మెరకముడిదాం: ప్రజలంతా సుఖసంతోషాలతో బాగుండాలని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ఆకాంక్షించారు. మండలంలోని సోమలింగాపురం గ్రామానికి ప్రతి ఏడాది వచ్చే మాదిరిగానే ఈ ఏడాది కూడా ముక్కనుమ రోజున డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు తన నివాసంలో ఇచ్చే ఆతిథ్యం స్వీకరించడానికి జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి మంగళవారం వచ్చారు. అక్కడికి వచ్చిన నియోజకవర్గ పార్టీ నాయకులు, ప్రజలతో మంత్రి బొత్స, జెడ్పీ చైర్మన్, ఎంపీ మాటామంతీ కలిపారు. నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు ఎంతశాతం పూర్తయిందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావును మంత్రి బొత్స ఆరా తీయగా..95 శాతానికి పైగా కొనుగోలు పూర్తయిందని జెడ్పీ చైర్మన్ తెలిపారు. మంత్రి స్పందిస్తూ చీపురుపల్లి నియోజకవర్గంతో పాటు జిల్లాలో ఇంకా ఎక్కడైనా కొనుగోలు చేయాల్సిన ధాన్యం ఏమైనా ఉంటే వెంటనే వాటిని కూడా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్‌కు ఫోన్ ద్వారా సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్లవిశ్వేశ్వరరావు, కోట్ల మోతీలాల్‌నాయుడు, కేఎస్‌ఆర్‌కే ప్రసాద్, బూర్లెనరేష్‌కుమార్, రైల్వేబోర్డ్‌మెంబర్ తాడేలఉమామహేశ్వరరావు, స్థానిక ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు, ఆర్‌ఈసీఎస్ మాజీ వైస్‌చైర్మన్ ఎస్.కృష్ణమూర్తిరాజు, తాడ్డి చంద్రశేఖర్, కర్రోతునాగేశ్వరరావు, సత్తారు శ్రీనివాసరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య


తెర్లాంలో విలేకరులతో మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామానికి దూరంగా మామిడి తోటలో సోమవారం లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పరిశీలించగా అది కచ్చితంగా హత్యేనని నిర్ధారించినట్లు బొబ్బిలి డీఎస్పీ బి.మోహన్‌రావు స్పష్టంచేశారు. మృతదేహం లభ్యమైన ప్రదేశాన్ని పరిశీలించిన అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న రాచగుమడాం వెళ్లే మట్టి రోడ్డు పక్కనే ఉన్న మామిడి తోటలో లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పరిశీలించగా నాలుగైదు రోజుల క్రితం మరణించి ఉందని తెలిపారు. మరణించిన వ్యక్తి వీపుపై ఉన్న కత్తిపోట్లు, మెడ, తలపైనా ఉన్న గాయాలను బట్టి హత్య చేసి మామిడి తోటలో పడేసినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. అయితే హత్యకు గురైన వ్యక్తి వివరాలు తెలియరాలేదన్నారు. మృతునికి 40–50 సంవత్సరాల మధ్య వయస్సు ఉండవచ్చని, 5.7అడుగుల ఎత్తు ఉన్నాడని చెప్పారు. మృతుడు వేసుకున్న దుస్తులు డాక్ కంపెనీకి చెందిన డ్రాయర్, నలుపురంగు బెల్ట్, సిమెంట్ రంగు ఫ్యాంట్ ఫస్ట్ బటన్ కంపెనీ వన్నారు. హత్యకు గురైన వ్యక్తి ఇటీవలే మూలవ్యాధి శస్త్ర చికిత్స చేయించుకున్నట్లు ఆనవాళ్లు కనిపించినట్లు తెలిపారు. పై పోలికలతో ఉన్న వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని డీఎస్పీ మోహన్‌రావు కోరారు. సమావేశంలో ఆయనతోపాటు బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు, రామభద్రపురం, తెర్లాం ఎస్సైలు బి.సురేంద్రనాయుడు, బి.రమేష్ ఉన్నారు.

స్టాఫ్ నర్సు పోస్టుల ఎంపికలో గందరగోళం

- నేటికి కౌన్సెలింగ్, పోస్టింగ్ ఆర్డర్స్ జారీ వాయిదా

మహారాణిపేట(విశాఖదక్షిణ): స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ కోసం ప్రకటించిన జాబితాపై గందరగోళం నెలకొంది. ఎంపిక జాబితాలో తమకు అన్యాయం జరిగిందంటూ నిరుద్యోగ నర్సులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ పోస్టుల్లో తమకు వెయిటేజ్ మార్కులు కలపలేదంటూ తాత్కాలిక ఉద్యోగ నర్సులు నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన కౌన్సెలింగ్, పోస్టింగ్ ఆర్డర్స్ జారీ బుధవారానికి వాయిదా పడింది. స్టాఫ్ నర్స్ పోస్టుల కోసం అభ్యర్థుల ఎంపిక జాబితాను వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనర్ శనివారం విడుదల చేశారు. ఈ నెల 17, 18వ తేదీల్లో కౌన్సెలింగ్ చేపట్టి.. నియామక పత్రాలు జారీ చేయాలని నిర్ణయించారు. పోస్టుల సంఖ్య పెరగడం , కోవిడ్ సమయంలో పనిచేసిన వారికి అదనపు మార్కులు కలపడం వంటి నిర్ణయాలు రావడంతో వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరి ఆధ్వర్యంలో తుది మెరుగులు దిద్ది జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఎంపిక జాబితాలో తమకు అన్యాయం జరిగిందంటూ కొంతమంది నిరుద్యోగ నర్సులు, వెయిటేజ్ మార్కులు కలపలేదంటూ తాత్కాలిక ఉద్యోగ నర్సులు మంగళవారం కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు.

సర్కారు సాయంతో ఇంతింతై..!

- పీఎంఈజీపీ రుణాలపై మహిళల ఆసక్తి
- జిల్లా వ్యాప్తంగా 456 దరఖాస్తులు
- 118 యూనిట్ల ప్రారంభం
- 35 శాతం సబ్సిడీతో రుణాలు
- చేగోడీల తయారీ, విస్తర్ల యూనిట్లు పెడుతున్న మహిళలు
- పాన్‌షాపుల నిర్వహణతో రాణింపు


పాగిరిలో చేగోడీల ఫ్యాక్టరీ పెట్టుకున్న లబ్ధిదారు

రాజాం: మహిళల ఆర్థిక పరిపుష్టి ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోంది. ఈ క్రమంలో వారు అన్నిరంగాల్లో రాణించేందుకు చర్యలు తీసుకుంటోంది. అమ్మఒడి, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా వంటి పథకాలతో మహిళలకు ఆర్థికంగా చేయూతనిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు పీఎమ్‌ఈజీపీ రుణాల ద్వారా వారు మరింత ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రాధాన్యం ఇస్తోంది. మహిళలకు రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధి పరిశ్రమలు ఏర్పాటుచేయిస్తోంది. ఈ మేరకు గ్రామాల్లో వైఎస్ఆర్ క్రాంతి పథం ద్వారా అవగాహన కల్పిస్తోంది.

జిల్లా వ్యాప్తంగా 456 దరఖాస్తులు

జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం ద్వారా 500 యూనిట్ల ఏర్పాటును డీఆర్‌డీఏ లక్ష్యంగా చేసుకుంది. ఇప్పటివరకూ ఈ పథకానికి సంబంధించి 456 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 118 యూనిట్లకు రుణాలు మంజూరు చేసి చేసి రూ.1.25 కోట్లు రుణంగా విడుదల చేశారు. 35 శాతం సబ్సిడీతో ఈ రుణాలు ఇచ్చినట్లు డీఆర్‌డీఏ ప్రకటించింది. బ్యాంక్ విల్లింగ్ ఉన్న దరఖాస్తుదారులకు వాటిని మంజూరు చేస్తున్నారు. రుణాన్ని సకాలంలో చెల్లించినవారికి మాత్రమే సబ్సిడీ వర్తిస్తుంది. మరో 113 యూనిట్లకు పరిశీలన పూర్తికాగా వాటికి కూడా ఈ నెలాఖరులోగా రుణాలు విడుదలచేయనున్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.50 వేల కనీస రుణం నుంచి రూ. 25 లక్షల వరకూ ఇస్తున్నారు. ఈ సారి వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువ మంది మహిళాసంఘాల సభ్యులు ఉండడం విశేషం.

కుటీర పరిశ్రమలకు తోడ్పాటు

పీఎమ్‌ఈజీపీ రుణాల ద్వారా మహిళలు లబ్ధిపొందుతున్నారు. ఎక్కువగా చేగోడీల తయారీ ఫ్యాక్టరీలు, అట్ట విస్తర్ల తయారీ పరిశ్రమలు నెలకొల్పుతున్నారు. ప్రతిరోజూ నలుగురి నుంచి ఆరుగురు వరకూ మహిళలు ఈ పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఇవే కాకుండా ఆర్గానిక్ కూరగాయల సాగు, పాడి పరిశ్రమ ఏర్పాటు, కోడిగుడ్ల విక్రయాలు వంటి ఉపాధి మార్కెట్‌లు పెట్టి లబ్ధిపొందుతున్నారు. ఇంటి ఖర్చులతో పాటు ఇతర ఖర్చులు కూడా ఒడ్డెక్కుతున్నట్లు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


రాజయ్యపేటలో పేపర్‌ప్లేట్ల పరిశ్రమ

చాలా మంచి పథకం



పీఎంఈజీపీ చాలా మంచి పథకం. ఈ పథకానికి ప్రోత్సాహానిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బ్యాంకులు గ్యారంటీ ఇస్తే రుణాలు తక్షణమే మంజూరవుతున్నాయి. కుటీర పరిశ్రమలు పక్కాగా నడుపుతూ మహిళా సంఘాల సభ్యులు ఎక్కువ లబ్ధిపొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ రుణాలను ఎక్కువగా మహిళా సంఘాలు వినియోగించుకుంటున్నాయి.

ఎ.కల్యాణ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ

ఉపాధి ఇచ్చింది



మేం పీఎంఈజీపీ ద్వారా పేపర్ విస్తళ్ల ఫ్యాక్టరీ పెట్టాం. 35 శాతం రాయితీ లభించింది. మంచి ఫలితాలు వస్తున్నాయి. కొంతమంది మహిళలు కూడా ప్రతి రోజూ పనిచేస్తూ లబ్ధిపొందుతున్నారు. రాజాం క్లస్టర్ పరిధిలో చాలా మంది మహిళలు ఈ రుణాల ద్వారా కుటీర పరిశ్రమలు, పాన్‌షాపులు వంటివి పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నారు.

సామంతుల అరుణకుమారి, రాజయ్యపేట. రాజాం మండలం